చిత్తారమ్మ జాతర షురూ

వేద మంత్రోచ్ఛారణల మధ్య మొదటిరోజు ప్రత్యేక పూజలు

పట్టు వస్త్రాలను తీసుకువస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్







గాజులరామారంలోని చిత్తారమ్మ దేవి జాతర శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. మొదటిరోజు వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య గణపతి పూజ, పుణ్యా వచనం, పంచగవ్యప్రాసన దీక్షాధారణ, అగ్ని ప్రతిష్ఠలు జరిగాయి. ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై బోనాలతో మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. ఆలయానికి ఇరువైపుల 2 కిలోమీటర్ల పరిధిలో మైకులు అమర్చారు. గుడి పరిసరాల్లో దుకాణాలు, రంగుల రాట్నాలు వెలియడంతో పండుగ వాతావరణం సంతరించుకుంది. అమ్మవారి ఆలయ పరిసరాలను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకొని రోడ్లపై ట్రాఫిక్ అంతరాయం కలగకుండా పలు ఆంక్షలు విధించారు. శనివారం రోజువారి పూజలతో పాటు సాయంత్రం 5గంటలకు గాజులరామారం గ్రామం నుంచి ఆలయం వరకు ఊరేగింపు ఉంటుందని ఆలయ కమిటీ చైర్మన్ కూన అంతయ్యగౌడ్ తెలిపారు. – సుభాష్‌నగర్

నేడు, రేపు కొత్త ఓటర్ల నమోదు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 155 పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఈనెల 20, 21 తేదీల్లో రెండు రోజుల పాటు కొత్త ఓటర్ల నమోదు, మార్పులు చేసుకునేందుకు స్పెషల్ క్యాంపైన్ నిర్వహిస్తున్నట్లు ఈఆర్‌ఓ పులి సైదులు ఓ ప్రకటనలో తెలిపారు. కొత్త ఓటరు నమోదు కోసం ఫారం–6, కరెక్షన్, పోలింగ్ స్టేషన్ మార్పిడానికి ఫారం–8, ఓటర్ డిలీట్ చేసుకోవడానికి ఫారం–7లను ఆయా పోలింగ్ స్టేషన్లలో ఎన్నికల సిబ్బంది అందజేయాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈఆర్‌ఓ కోరారు.

ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి

కుత్బుల్లాపూర్: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని కొంపల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీహరి కోరారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. ఈ నెల 20, 21 తేదీల్లో నూతన ఓటర్ నమోదు, ఓటర్ కార్డులో మార్పులు చేర్పులపై మున్సిపల్ వ్యాప్తంగా 24 పోలింగ్ స్టేషన్లలో స్పెషల్ క్యాంప్ నిర్వహిస్తున్నామని తెలిపారు. 18 ఏళ్ల పైబడిన వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు. కొంపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో 7కేంద్రాలు, కొంపల్లి ఎంపీపీ స్కూల్‌లో 7 కేంద్రాలు, దూలపల్లి జడ్పీహెచ్‌లో 4 కేంద్రాలు, ఎంపీపీ స్కూల్‌లో రెండు కేంద్రాలు, కొంపల్లి ఢిల్లీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో రెండు కేంద్రాలు, పీయర్‌సన్ స్కూల్‌లో రెండు కేంద్రాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

విద్యార్థులకు కేలండర్ల అందజేత



విద్యార్థులకు కేలండర్లను అందజేస్తున్న ప్రిన్సిపాల్ మండల శ్రీనివాస్‌గౌడ్

కుత్బుల్లాపూర్: ప్రతి సంవత్సరం తమ స్కూల్‌లో విద్యనభ్యసించే విద్యార్థులకు ఉచితంగా నూతన సంవత్సరం కేలండర్లు అందజేస్తున్నామని వివేకానంద విద్యా మందిర్ హైస్కూల్ ప్రిన్సిపాల్ మండవ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సుభాష్‌నగర్ డివిజన్‌లోని వివేకానంద విద్యా మందిర్ హైస్కూల్‌లో కరస్పాండెంట్ సునీతతో కలిసి ఆయన విద్యార్థులకు కేలండర్లను పంపిణీ చేశారు. ఆశాజనక విద్యా సంవత్సరం ప్రారంభాన్ని సూచిస్తుందన్నారు. అందులో భాగంగా ప్రతి విద్యార్థికి కాలమానిక పట్టికను అందజేశామని శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

నిజాంపేట్ మేయర్‌కు ఆహ్వానం



మేయర్ నీలారెడ్డిని కలిసిన మార్వాడీ మిత్ర మండలి సభ్యులు

నిజాంపేట్: నిజాంపేట్ మార్వాడీ మిత్ర మండలి సభ్యులు శుక్రవారం మేయర్ కొలన్ నీలారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 22న అయోధ్య రామమందిరంలో బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవ కార్యక్రమం నేపథ్యంలో జాగ్వన్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనాలని మార్వాడీ మిత్రమండలి సభ్యులు మేయర్‌ను ఆహ్వానించారు.

పేట్‌బషీరాబాద్‌లో రోడ్డు భద్రతా వారోత్సవాలు



వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న టీడీవో కిషన్, వెహికల్ ఇన్‌స్పెక్టర్లు

కుత్బుల్లాపూర్: రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మేడ్చల్ జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం డీటీవో కిషన్ నేతృత్వంలో పేట్‌బషీరాబాద్ జాతీయ రహదారిలోని సర్వీసు రోడ్డులో వాహనదారులకు ట్రాఫిక్ రూల్స్, హెల్మెట్ ధారణ, నిబంధనలు పాటించకుంటే కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. చాలా వరకు ప్రమాదాలు రాంగ్ రూట్‌డ్రైవింగ్ చేయడం వల్లే జరుగుతున్నాయని అన్నారు. హెల్మెట్ ధరించని చాలా మంది ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోందని డీటీవో కిషన్ వాహనదారులకు వివరించారు. హెల్మెట్ ధరిస్తే ప్రాణానికి రక్షణ కలుగుతుందన్నారు. సురక్షితంగా ఇళ్లకు చేరుకోవాలంటే ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ప్రతాప్, రాజా, రవికుమార్, త్రివేణి, మహేష్, సిబ్బంది పాల్గొన్నారు

భూకబ్జాదారుడికి ఏడాది జైలు

జగద్గిరిగుట్ట: ప్రభుత్వ భూమిలో అక్రమంగా చొరబడి గదులను నిర్మించిన కేసులో ఓ భూకబ్జాదారుడికి కూకట్‌పల్లి మెజిస్ట్రేట్ కోర్టు సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించింది. వివరాల ప్రకారం.. కట్టమైసమ్మ బస్తీ దేవేందర్‌నగర్‌కు చెందిన ముండవర్ రమేష్‌నాయక్(46) ప్రైవేట్ వర్కర్. కాగా 2019వ సంవత్సరం మార్చి నెలలో రమేష్‌నాయక్ గాజులరామారం గ్రామం సర్వేనం.329/1లోని ప్రభుత్వ స్థలంలో రెండు గదులను నిర్మించి పేదప్రజలకు నోటరీ చేసి విక్రయిస్తున్నట్లు స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2019 మార్చినెలలో పోలీసులు రమేష్‌పై 471,353,447,467,420 ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కేసు కోర్టులో ఉండగా శుక్రవారం తుది తీర్పు వెలువడింది. కేసు పూర్తి వివరాలు పరిశీలించిన మెజిస్ట్రేట్ రమేష్‌కు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధించారు.

వాహనాల చోరీలకు పాల్పడుతున్న యువకుడి అరెస్టు

జగద్గిరిగుట్ట: బైకులు దొంగతనం చేసి తప్పించుకొని తిరుగుతున్న ఓ నిందుతున్ని అదుపులోకి తీసుకున్న ఘటన జగద్గిరగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ క్రాంతికుమార్ వివరాల ప్రకారం... శ్రీరాంనగర్‌కు చెందిన బోయ మహేష్ (19) కొంత కాలంగా ఇంటిముందు నిలిపిన వాహనాలను దొంగిలిస్తూ పోలీసులకు దొరక్కుండా తిరుగుతున్నాడు. పక్కా సమాచారంతో పోలీసులు చాకచక్యంగా జగద్గిరిగుట్టలో అదుపులోకి తీసుకొని విచారించారు. మహేష్ దగ్గర మొత్తం 5 బైకులను స్వాధీనం చేసుకున్నారు.

ప్రభుత్వ స్థలాల్లోని నిర్మాణాలను తొలగించాలి

సుభాష్‌నగర్: ప్రభుత్వ భూములను ప్లాట్లుగా చేసి పేదలకు అంటగడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు. గాజులరామారం సర్వే నం.12, దేవేందర్‌నగర్ డబల్ బెడ్రూమ్, సర్వే నం.329, 326, 342లలో కొత్తగా ఇళ్లు నిర్మించి కోర్టు ఆర్డర్ ఉందంటూ కబ్జాచేస్తున్నారని అన్నారు. సదరు నిర్మాణాలను వెంటనే తొలగించాలని సీపీఐ నాయకులు కోరారు. తహసీల్దార్ అందుబాటులో లేకపోవడంతో ఆర్‌ఐ రేణుకకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు హరినాథ్, కార్యదర్శి ఉమామహేష్, ప్రజానాట్యమండలి అధ్యక్షుడు ప్రవీణ్, మండల కోశాధికారి సదానంద, ఇమామ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన సమస్యలను పరిష్కరిస్తాం



బౌరంపేట పీఏసీఎస్ కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నామని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన పలు సంక్షేమ సంఘాల నేతలు, ప్రజలు ఆయనను కలిశారు. శంభీపూర్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రాజు మాట్లాడుతూ.. యుద్ధప్రాతిపదికన సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అధికారులు స్థానిక సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

కేలండర్ ఆవిష్కరణ..

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బౌరంపేట్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన సంవత్సర కేలండర్‌ను ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు శంభీపూర్ రాజు, చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. అదే విధంగా రేయాన్స్ ప్రాపర్టీస్ డైరీ, గోల్డ్‌స్టోన్ స్కూల్ కేలండర్లను ఆవిష్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అర్కల అనంతస్వామి, నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సాయియాదవ్, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ నల్తూరి కృష్ణ, కార్యదర్శి సయ్యద్ అసదుల్ల, డైరెక్టర్లు జీతయ్య, డప్పు కృష్ణ, మోహన్ నాయక్, మహిపాల్‌రెడ్డి, భీమ్‌రెడ్డి, పార్టీ నాయకులు హన్మంతరావు, మురళి యాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రాజేందర్, ప్రదీప్‌సింగ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూములను పరిరక్షించాలి



మంత్రి కొండా సురేఖను కలిసిన నర్సారెడ్డి భూపతిరెడ్డి

దుండిగల్: అటవీ భూముల పరిరక్షణతో పాటు రోడ్డు విస్తరణ పనులను వేగంగా కొనసాగించాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి కోరారు. ఈ మేరకు సచివాలయంలో అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిసి పలు అంశాలపై చర్చించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అటవీ భూములను కాపాడాలన్నారు. అదే విధంగా కొంపల్లి నుంచి బహదూర్‌పల్లి, గండి మైసమ్మ చౌరస్తా నుంచి ప్రగతినగర్ వరకు నిర్మిస్తున్న రోడ్డు మధ్యలో ఉన్న అటవీ భూముల సేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని భూపతిరెడ్డి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై మంత్రి కొండా సురేఖ సానుకూలంగా స్పందించి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు భూపతిరెడ్డి తెలిపారు.

శుభాకాంక్షలు



మహేష్‌కుమార్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న జెమ్మి దేవేందర్, ప్రశాంత్‌గౌడ్

కుత్బుల్లాపూర్: తెలంగాణ శాసనమండలికి ఎమ్మెల్సీగా ఎన్నికైన మహేష్‌కుమార్‌గౌడ్‌కు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. శుక్రవారం గాంధీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రశాంత్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జెమ్మి దేవేందర్ ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సత్కరించారు.

కష్టపడేవారికే పార్టీలో గుర్తింపు

సుభాష్‌నగర్: కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పని చేసే ప్రతి ఒక్కరికి గుర్తింపు లభిస్తుందని కుత్బుల్లాపూర్ ఏ–బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం నూతనంగా ఎమ్మెల్సీలుగా ఎన్నికైన మహేష్ కుమార్‌గౌడ్, బల్మూరి వెంకట్‌లను శ్రీనివాస్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. కాంగ్రెస్ నాయకులు పూర్ణచందర్, బండి అవినాష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటా



ఎస్‌ఆర్ నాయక్‌నగర్‌లో ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న కాలనీవాసులు

కుత్బుల్లాపూర్: అభివృద్ధికి పట్టం కడుతూ హ్యాట్రిక్ విజయం అందించిన నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. కృతజ్ఞత యాత్రలో భాగంగా శుక్రవారం సుభాష్‌నగర్ డివిజన్ పరిధిలోని గంపల బస్తీ, రామిరెడ్డినగర్, డీపీకాలనీ, ఎస్‌ఆర్‌నాయక్ నగర్, అపురూపకాలనీ, మోడీ బిల్డర్స్, జనప్రియ నెస్ట్ అపార్ట్‌మెంట్స్‌లలో పర్యటించిన ఎమ్మెల్యేకు ప్రజలు ఘన స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హ్యాట్రిక్ విజయం తనపై మరింత బాధ్యతలు పెంచిందన్నారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ హేమలత సురేష్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు పోలే శ్రీకాంత్, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో–ఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, మాజీ కౌన్సిలర్ రంగారావు, సీనియర్ నాయకులు ఎంఎస్ వాసు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి..

బాధ్యతగా నడపాలి

మేడ్చల్ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి



ఐడీపీఎల్‌లోని ఏ2ఏ హోమ్ ల్యాండ్ ప్రాజెక్ట్ ఉద్యోగులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పిస్తున్న మేడ్చల్ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ

రంగారెడ్డినగర్: వాహనాలు నడిపే సమయంలో జాగ్రత్తలు పాటించడమే కాకుండా బాధ్యతాయుతంగా డ్రైవింగ్ చేస్తేనే తనతో పాటుగా ఇతరులు ప్రమాదాల బారిన పడకుండా ఉంటారని మేడ్చల్ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఐడీపీఎల్‌లో కొనసాగుతున్న ఏ2ఏ హోమ్ ల్యాండ్ ప్రాజెక్టు ఉద్యోగులకు శుక్రవారం ట్రాఫిక్ అవేర్‌నెస్ కార్యక్రమంతో పాటుగా పనిచేస్తున్న ప్రదేశాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... వాహనాలు నడుపుతున్న సందర్భంలో ప్రతి ఒక్కరూ రూల్స్ పాటించాలన్నారు. అదే విధంగా పాదచారులు రోడ్డు దాటే సమయంలో మొబైల్ ఫోన్లను వినియోగించరాదన్నారు.

◆ పాదచారులు ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు, జీబ్రా క్రాసింగ్‌ల వద్దనే సాధ్యమైనంత వరకు రోడ్డు దాటడం సురక్షితం అని పేర్కొన్నారు. సేఫ్టీ అండ్ రెస్పాన్సిబుల్ డ్రైవింగ్ అందరూ అలవర్చుకోవాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తున్న సందర్భంలో జరిగిన ప్రమాదాలపై కొన్ని అంశాలను పేర్కొంటూ తద్వారా జరిగిన తీవ్ర పరిణామాలను ఉద్యోగులకు వివరించారు. అదే విధంగా పనిచేస్తున్న ప్రదేశాలలో కూడా నియమ నిబంధన అనుసరించి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు, బాలానగర్ ట్రాఫిక్ సీఐ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ అండర్–14కు శ్రేయాస్ మెడిచర్ల ఎంపిక



కుత్బుల్లాపూర్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్–14 విభాగంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల గ్రామానికి చెందిన శ్రేయాస్ మెడిచర్ల ఎంపికయ్యాడు. ఎడమచేతి స్పిన్ బౌలర్, బ్యాటింగ్‌లో రాణించే ఈ బాలుడు సెయింట్ ఆండ్రూస్ హైస్కూల్లో 8వ తరగతి చదువుతున్నాడు. రావుస్ క్రికెట్ అకాడమీలో కోచ్ నర్సింగ్ రావు పర్యవేక్షణలో శిక్షణ పొందుతున్నాడు. అండర్–14కు ఎంపికైన శ్రేయాస్ తమిళనాడు రాష్ట్రం మధురైలో జరిగే టోర్నమెంట్‌కు వెళ్లనున్నాడు. సందర్భంగా రావుస్ క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు.

పొలంలో కట్టేసిన గొర్రెల చోరీ

దుండిగల్: వ్యవసాయ పొలంలో కట్టేసిన గొర్రెలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బౌరంపేట ప్రాంతానికి చెందిన పర్మ రమేశ్ స్థానికంగా ఉన్న కోమటికుంట చెరువు వెనుక ఉన్న తన వ్యవసాయ పొలంలో గొర్రెలను మేపుతు పాడి వ్యవసాయం చేస్తున్నాడు. ప్రతి రోజు ఉదయం గొర్రెలను తీసుకుని చుట్టు పక్కల ప్రాంతాల్లో మేతకు తీసుకెళ్లి సాయంత్రం తిరిగి షెడ్డులో కట్టేస్తుంటాడు. ఎప్పటి లాగే ఈనెల 18వ తేదీన ఉదయం వెళ్లి చూడగా షెడ్డులో ఉన్న 25 గొర్రెలు కనిపించ లేదు. చుట్టు పక్కల వెతికినా కనిపించకపోవడంతో తన గొర్రెలను దొంగలించాలని రమేశ్ దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జగద్గిరిగుట్ట డివిజన్‌లో కార్పొరేటర్ పర్యటన

జగద్గిరిగుట్ట: ప్రజా సమస్యల పరిష్కారంలో తాను ఎప్పుడూ ముందుంటానని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ జగన్ అన్నారు. డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో సమస్యలపై శుక్రవారం ఆయన పాదయాత్ర నిర్వహించారు. రోడ్లు, డ్రైనేజీ తదితర సమస్యలపై స్థానికులను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్థానికంగా ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకొని వస్తే వీలైనంత తొందరగా పరిష్కారించేలా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దాసు, కొండయ్య సాగర్, రామకృష్ణ, ప్రభాకర్, శ్యామ్, రాజు, విమలాదేవి, శోభ తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలపై విచారణ చేపట్టి న్యాయం చేయాలి

డీసీకి సమాఖ్య సభ్యుల ఫిర్యాదు



గాజులరామారం ఉప కమిషనర్ మల్లయ్యకు ఫిర్యాదు చేస్తున్న సమాఖ్య గ్రూపు మహిళలు

కుత్బుల్లాపూర్: టౌన్ లెవల్ ఫెడరేషన్‌లో మహిళా సభ్యులు పొదుపు చేసుకున్న నగదు విషయంలో అవకతవకలు జరిగాయని దీనిపై విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని శుక్రవారం సమాఖ్య సభ్యులు గాజులరామారం ఉపకమిషనర్ మల్లయ్యను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ.. కొన్ని సంవత్సరాలుగా టౌన్ లెవెల్ ఫెడరేషన్ ఏర్పాటు చేసుకొని పొదుపు, అప్పులు లావాదేవీలు నిర్వహించుకుంటు వస్తున్నామన్నారు. ఇప్పటి వరకు ఫెడరేషన్‌కు విజయలక్ష్మి అధ్యక్షురాలిగా కొనసాగుతూ వస్తున్నారని తెలిపారు. కొత్త వారికి అవకాశం ఇవ్వాలని.. పొదుపు లెక్కలు చూపాలని కోరినా ఆరు నెలలుగా తాత్సర్యం చేస్తున్నారని ఆరోపించారు. టౌన్ లెవెల్ ఫెడరేషన్‌లో మొత్తం ఐదుగురు ఆఫీస్ బేరర్లు ఉంటే నలుగురు ఆఫీస్ బేరర్లు తప్పుకుంటున్నట్లు చెప్పామన్నారు. ప్రస్తుతం సమాఖ్య అధ్యక్షురాలు మాత్రమే సమావేశానికి హాజరవుతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం తీసుకునే నిర్ణయాలు, తీర్మానాలు అమలు కావని, తక్షణమే టౌన్ లెవెల్ ఫెడరేషన్‌ను సమావేశపరిచి ఎన్నికల ద్వారా నూతన ఫెడరేషన్‌ను ఎన్నుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. పొదుపు చేసిన నగదు విషయంలో తమకు న్యాయం చేయాలని డీసీని మహిళా సభ్యులు కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు.

అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలి

మళ్లీ అక్రమ నిర్మాణాలకు పూనుకుంటున్న వైనం

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ దేవేందర్‌నగర్, కైసర్‌నగర్ బస్తీలలో ప్రభుత్వ స్థలాల్లో వెలిసిన నిర్మాణాలపై అప్పటి ‘సాక్షి’కథనాలతో డిసెంబర్ 17న రెవెన్యూ అధికారులు 500 ఇళ్లను నేలమట్టం చేశారు. గత కొన్ని రోజులుగా చలిచప్పుడు లేకుండా ఉన్న కబ్జారాయుళ్లు రెండు రోజుల నుంచి రాత్రి వేళలో చాప కింద నీరులా ప్రభుత్వ స్థలాల్లో మరలా నిర్మాణాలకు పూనుకున్నారు. సర్వే నంబర్ 307, 342లలో హిబ్రాలను ముందు ఉంచి నిర్మాణాలు చేపడుతున్నారు. గతంలో కబ్జారాయుల చేతిలో మోసపోయిన బాధితులు వందల మంది ఉన్నారు. మళ్లీ మోసపోకుండా ఉండాలంటే ముందుగా ఆ నిర్మాణాలకు రెవెన్యూ అధికారులు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

అక్రమ నిర్మాణాలపై కొరడా



నిజాంపేట్: ప్రభుత్వ స్థలాల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలపై బాచుపల్లి మండల రెవెన్యూ అధికారులు కొరడా ఝళిపించారు. శుక్రవారం నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి, నిజాంపేట్, ప్రగతినగర్‌లోని ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలను జేసీబీతో కూల్చివేశారు. మరోమారు నిర్మాణాలు చేపడితే ల్యాండ్ గ్రాబింగ్ కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య



సైచి (ఫైల్)

కుత్బుల్లాపూర్: భర్త, పిల్లలతో దూరంగా ఉంటున్న ఓ వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్ ఏరోనాటికల్ ఎన్‌క్లేవ్ ప్రాంతానికి చెందిన గాజుల సైచి(26), సన్నీలకు కొద్ది సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా సైచి తన భర్తతో గొడవ పడి మూడు సంవత్సరాలుగా పుట్టింటి వద్దనే ఉంటుంది. అప్పటి నుంచి భర్త, పిల్లలతో దూరంగా ఉండడంతో తీవ్ర మనస్తాపానికి గురైంది. ఈ క్రమంలో ఈ నెల 18వ తేదీన రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి కళావతి ఫిర్యాదు మేరకు పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.